సాక్షి
పెద్దపల్లి
బుధవారం, 13, సెప్టెంబర్, 2023



గ్రీన్‌సిగ్నల్ లభించేనా..?

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ముందు సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇస్తుందా..? 8లో



లక్ష్య సాధనకు కృషిచేయాలి

బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు సమష్టిగా కృషి చేయాలని కార్పొరేట్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు జీఎం రమేశ్ అన్నారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం 30.0 /24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

18న వినాయక చవితి

గోదావరిఖనిటౌన్: ఈనెల 18వ తేదీనే వినాయక చవితి జరుపుకోవాలని స్థానిక శ్రీకోదండ రామాలయ ప్రధాన అర్చకులు గోవర్ధనగిరి మధుసూదనాచార్యులు తెలిపారు. పారిశ్రామిక ప్రాంత ప్రజలు ఎలాంటి అనుమానాలకూ తావివ్వకుండా వేడుకలను 18న నిర్వహించుకోవాలని, 27న నిమజ్జనం చేసుకోవాలని సూచించారు.

మచ్చుపేటలో రెండోరోజూ మెడికల్ క్యాంపు

- జిల్లా మలేరియా అధికారి రాజామౌళి సందర్శన

ముత్తారం: మండలంలోని మచ్చుపేటలో మెడికల్ క్యాంపు మంగళవారం కూడా కొనసాగింది. గ్రామస్తులు విషజ్వరాలతో బాధపడుతుండగా.. 'మంచంపట్టిన మచ్చుపేట' శీర్షికను 'సాక్షి' కథనం ప్రచురించింది. దీంతో రెండురోజులుగా జిల్లా, మండల స్థాయి అధికారులు గ్రామంలో పర్యటిస్తున్నారు. మొదటి రోజు 112మందికి పరీక్షలు చేసిన వైద్యులు.. రెండోరోజున 45మందిని పరీక్షించారు. ఇందులో జ్వరాలు, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నవారే అధికంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రాజామౌళి గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. జ్వరాల పరిస్థితులను స్థానిక వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వ్యాధులు తగ్గేవరకూ వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. మురికి కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని శుభ్రం చేసుకోవాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ మేడగోని సతీశ్‌గౌడ్, జిల్లా మలేరియా అసిస్టెంట్ అధికారి ఉమామహేశ్వర్‌రావు, వైద్య సిబ్బంది శోభారాణి, దీప్తి, లత, కల్పన, రజిత ఉన్నారు.

సభ్యుల సంక్షేమం కోసమే కంప్యూటరైజేషన్



పీఏసీఎస్‌ను సందర్శించిన నాబార్డ్ జీఎంలు

సుల్తానాబాద్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోని రైతుల సంక్షేమం కోసమే సంఘాన్ని కంప్యూటరైజేషన్ చేసినట్లు నాబార్డ్ జీఎం ఏవీ.భవానిశంకర్, ప్రభోదితపాండే అన్నారు. మంగళవారం సుల్తానాబాద్ పీఏసీఎస్‌ను సందర్శించారు. ప్యాక్స్ కంప్యూటరైజేషన్‌తో కలిగే లాభాలు వివరించారు. ఇంకా పొరబాట్లు ఉన్నాయా తెలుసుకున్నారు. భవిష్యత్తులో సంఘం మరిన్ని అవార్డులు గెలుచుకుంటుందని తెలిపారు. సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, కేడీసీసీబీ సీఈఓ సత్యనారాయణరావు, నాబార్డు డీడీఎంపీ మనోహర్ రెడ్డి, కార్యదర్శి బూరుగు సంతోష్ కుమార్, బ్యాంక్ మేనేజర్ శశిధర్‌రావు, ఎస్టాబ్లిష్‌మెంట్ మేనేజర్ హన్మంతరావు, ప్యాక్స్ రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ, సూపర్‌వైజర్ కే.సాగర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీకి పెద్దపల్లి టికెటివ్వాలి



ఇంద్రసేనారెడ్డితో అర్జున్‌రావు

సుల్తానాబాద్: పెద్దపల్లి అసెంబ్లీ స్థానాన్ని బీజేపీ నుంచి బీసీకి కేటాయించాలని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డిని పార్టీ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు మీస అర్జున్‌రావు కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి విన్నవించారు. తాను టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నానని, తనకు అవకాశం కల్పించేలా చూడాలని విన్నవించారు. బీసీకి టికెట్ ఇస్తే గెలిచే అవకాశాలు అత్యధికంగా ఉంటాయని వివరించారు. ఆయన వెంట కేశవరావు, కొమ్ము తిరుపతి, మహేందర్ తదితరులు ఉన్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరందిస్తాం



రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి అంతర్గాం, పాలకుర్తి మండలాలకు సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ తెలిపారు. అంతర్గాం మండలం ముర్మూర్‌లో చాలామంది కాంగ్రెస్‌లో చేరగా.. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజల జీవన విధానంలో మార్పులు వస్తాయన్నారు. కాంగ్రెస్ ప్రతినిధులు ఉరిమెట్ల రాజలింగం, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్, పెంద్రు హన్మాన్‌రెడ్డి, గొర్రె చందు, గాదె సుధాకర్, మద్ది తిరుపతి, బర్పటి శ్రీనివాస్, సింగం కిరణ్‌కుమార్ తదితరులున్నారు.

అంతం చేస్తున్నారు

- నిందితుల్లో అందరూ అయినవారే
- హడలెత్తిస్తున్న 'కుటుంబ' హత్యలు
- ఆర్థిక, భూవివాదాలే కారణం



- పెద్దపల్లి పట్టణ శివారు చందపల్లికి చెందిన నాంపల్లి రాజమ్మను అరగుంట భూమి తన బిడ్డకు ఇవ్వగా.. మరోబిడ్డ కూమరుడు రాజమ్మ తలపై ఇనుప రాడ్డుతో కొట్టి హత మార్చాడు. ఆస్తి కోసం అమ్మమ్మను సొంత మనమడు హత్య చేశాడు.
- జూలై 7న సుల్తానాబాద్ మండలం అల్లిపూర్‌లో ఆస్తికోసం సొంత తల్లిదండ్రులైన కొమ్ము రాజమ్మ, పోశాలుపై కొడుకు కత్రతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు.
- ఇలా కారణాలేమైనా విచక్షణ మరిచి, క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలతో సొంత మనుషులనే హతమరుస్తుండటం జిల్లాలో ఆందోళన కలిగిస్తోంది.
- జూలై 26న ధర్మారం మండలం కొత్తూరు గ్రామంలో ఆస్తి తగాదాలతో సొంత అన్నను తమ్ముడు, అక్క హత్య చేయించారు. ఈ సంఘటన జిల్లాలో కలకలం రేపింది.

సాక్షి, పెద్దపల్లి: ఒకే కడుపున పుట్టిన అన్నదమ్ములు, రక్షణగా ఉండాల్సిన రక్త సంబంధీకులే ఆస్తి కోసం, భూమి కోసం అయినవారిపై పగతో రగిలిపోతున్నారు. వివాహేతర సంబంధం కోసం కట్టుకున్న భర్తను ప్రియుడితో కలిసి అంతమొందించిన భార్య.. ఇలా బంధమేదైనా ఘర్షణలకు దిగి హత్యలకు పాల్పడుతున్నారు. సామరస్యంగా పరిష్కరించుకోవాల్సిన తగాదాలను అవగాహన లేమితో హత్యలు చేస్తూ నేరాల్లో చిక్కుకుంటున్నారు. జిల్లాలో భూఆస్తి, వివాదాల నేపథ్యంలో జరుగుతున్న దాడులు, ఇతర నేరాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వారసత్వంగా వచ్చిన భూముల పంపకంలో నెలకొన్న వివాదాలు దాయాద కుటుంబాల్లో పగను పెంచుతున్నాయి. తమకు చెందిన భూములు, స్థలాలు ఏవైనా వివాదాలు ఉంటే న్యాయస్థానాల ద్వారా పరిష్కరించుకోకుండా కొంతమంది మానవత్వం లేకుండా హత్యలకు పాల్పడుతున్నారు. ఫలితంగా నిందితులుగా మిగిలిపోతున్నారు. కుటుంబ సంబంధాల కంటే ఎక్కువగా ఆస్తుల కోసమే తాపత్రయపడుతున్నారు. ఏ సమస్యనైనా శాంతిపూర్వకమైన వాతావరణంలో పరిష్కరించుకోవచ్చుననే విషయాన్ని మరిచి కటాకటాల పాలవుతున్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ దెబ్బతినడమే దీనికి కారణంగా నిపుణులు చెబుతున్నారు. బంధుత్వాలు, బాంధవ్యాలు కృతిమంగా మారిపోవడంతోనే ఈలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అయినవారిపై అఘాయిత్యాలను నియంత్రించేలా స్వచ్ఛంద సంస్థలు, పోలీసులు అవగాహన సదస్సులు, కళాజాత ప్రదర్శనలతో ప్రజల్లో చైతన్యం తేవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

సెటిల్‌మెంట్ అడ్డాలుగా

పెద్దపల్లి జిల్లాకేంద్రంగా మారడంతో సహజంగానే భూములకు ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రతి స్థలం విలువైనదిగా మారిపోయింది. భూములు, స్థలాల గొడవల నేపథ్యంలో దాడులు, తమస్థలాలను ఆక్రమిస్తున్నారని పోలీస్ స్టేషన్‌కు వస్తున్న ఫిర్యాదులు ఎక్కువగానే ఉంటున్నాయి. జిల్లాలో పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని, గోదావరిఖని మండలాల్లో భూవివాదాలకు సంబంధించిన కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. తమ భూమిలోకి చొచ్చుకొని వచ్చి ధ్వంసం చేశారని, మోసపూరితంగా క్రయవిక్రయాలు జరిపారని ఆరోపిస్తూ బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. భూవివాదాల్లో పోలీసులకు పరిమితమైన అధికారాలు ఉండటంతో ఆయా ఫిర్యాదులపై విచారణ జరిపి కొన్నింటిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తుండగా.. మరికొన్నింటిపై న్యాయస్థానాల్లో తేల్చుకోవాలని సూచనలు చేస్తున్నారు. మరికొందరు పోలీసులు ఇదే అదునుగా కొందరికి వత్తాసు పలుకుతూ సమస్యను జఠిలం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో బాధితుల్లో వైరివర్గాల్లో ఎవరో ఒకరు క్షణికావేశంలో హత్యలకు, దాడులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

స్వార్థంతోనే ఘటనలు



ఉమ్మడి కుటుంబ వ్యవస్థ దెబ్బతినడం, కృత్రిమ బంధాలతో ఇలాంటి నేరాలు పెరుగుతున్నాయి. ఒక మనిషిలో చంపాలనుకునే వారిలో 'నేను..' అనే స్వార్థం పెరిగిపోయి ఎదుటివారికి ఎంతటి బాధ కలిగినా స్పందించని వ్యక్తిత్వం ఏర్పడుతుంది. ఇది చాలా ప్రమాదకరం. వీరి స్వార్థ ఆలోచన ధోరణితో పాటు మద్యం మత్తు ఇలాంటి హత్యలకు దారితీస్తుంది.

– డాక్టర్ రవివర్మ, మానసిక వైద్యనిపుణులు, జీజీహెచ్

సామరస్యంగా పరిష్కరించుకోవాలి



సమాజంలో రోజురోజుకూ పతనమవుతున్న విలువలకు ఈ సంఘటనలు తార్కాణంగా నిలుస్తున్నాయి. ఆస్తులు, భూములు విషయాల్లో తగాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి. పోలీస్‌స్టేషన్‌కి వచ్చే భూసమస్యల కేసులకు ఇరువర్గాల వారికి కౌన్సెలింగ్ అందిస్తూ న్యాయస్థానాల్లో పరిష్కరించుకోవాలని సూచిస్తున్నాం. అవగాహన లేమితో దాడులకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

– వైభవ్ గైక్వాడ్, డీసీపీ

రూ.240.92 కోట్ల రుణమాఫీ

- లబ్ధిదారులు 47,848 మంది రైతులు
- నెలాఖరులోపు రుణమాఫీ పూర్తి కావాలి
- సమస్యల పరిష్కారానికి హెల్ప్‌డెస్క్
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లిరూరల్: జిల్లాలో రైతులకు రుణమాఫీ ప్రక్రియను ఈనెలాఖరు వరకు పూర్తి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లో రుణమాఫీ, కొత్త రుణాల మంజూరుపై వ్యవసాయ, బ్యాంకు అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఇప్పటివరకు 47,848 మంది రైతులకు రూ.240.92 కోట్ల రుణమాఫీ అయ్యిందని, మరో 27,971 మందికి రూ.229.60 కోట్లు ఈనెలాఖరులోపు జమ కానున్నాయని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 4,517 మంది రైతుల రుణఖాతాలు క్లోజ్ అయ్యాయని, అందుకే రుణమాఫీ సొమ్ము ప్రభుత్వం విడుదల చేసినా వారి ఖాతాలో జమ కాలేదని పేర్కొన్నారు. ఆయా రైతుల ఆధార్ నంబర్‌తో రైతుల రైతుబంధు ఖాతా వివరాలు సేకరించి జమ చేస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా 161 మంది రైలు బ్యాంకు వివరాలు అందుబాటులో లేవని, ఆ జాబితా ప్రకారం వ్యవసాయాధికారులు ఏఈఓలతో సేకరించాలని ఆదేశించారు.

కొత్త రుణాలివ్వాలి

ప్రభుత్వం ఇప్పటికే రూ.లక్ష రుణమాఫీ చేసిందని, రుణమాఫీ పొందిన ప్రతి రైతుకూ కొత్తగా పంటరుణాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేయాలని బ్యాంకర్లను కలెక్టర్ ఆదేశించారు. బ్యాంకర్లు గ్రామాల వారీగా పంట రుణమాఫీకి సంబంధించి వివరాలను వ్యవసాయ శాఖ అధికారులకు అందించాలన్నారు.

హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

రైతు రుణమాఫీపై రైతులకు ఉన్న సందేహాలను తీర్చేందుకు కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తామన్నారు. రుణమాఫీ అంశంపై సంపూర్ణ అవగాహన ఉన్న అధికారులను నియమించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్, ఉద్యానవన శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి, వ్యవసాయ అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

మహిళ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- మరో మూడు పీహెచ్‌సీల్లో 'ఆరోగ్య మహిళ' సేవలు
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



పీహెచ్‌సీని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే దాసరి

పెద్దపల్లిరూరల్: మహిళల ఆరోగ్య సమస్యలకు మెరుగైన వైద్యం అందించేలా ప్రభుత్వం ఆరోగ్యమహిళా కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. జిల్లాలో కొత్తగా పెద్దపల్లి మండలం రాఘవాపూర్, ఆలూరు, లక్ష్మీపూర్ పీహెచ్‌సీలలో ఆరోగ్య మహిళా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రాఘవాపూర్ పీహెచ్‌సీలోని కేంద్రాన్ని కలెక్టర్, దాసరి ప్రారంభించారు. మహిళ తన ఆరోగ్య సంరక్షణకు ఈ కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. కేంద్రాల్లో 8 విభాగాల్లో పరీక్షలు చేస్తారని, డయగ్నొస్టిక్ హబ్ ద్వారా పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్యాన్ని అందిస్తారని వివరించారు. అంతకుముందు వైద్యాధికారులు, సిబ్బందితో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. పీహెచ్‌సీకి వచ్చిన గ్రామస్తులతో కలెక్టర్ ముచ్చటించి ఆరోగ్యసేవలపై ఆరా తీశారు. డీఎంహెచ్‌ఓ ప్రమోద్‌కుమార్, వైద్యాధికారి లావణ్య తదితరులున్నారు.

మైనార్టీ రెసిడెన్షియల్ కాలేజీ సందర్శన

రాఘవాపూర్‌లోని మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కాలేజీని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. అద్దెభవనంలో సమస్యలున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. లక్ష్యాలు సాధించే దిశగా క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలని సూచించారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- మెడికోలకు పోలీసుల అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న పోలీసులు, పాల్గొన్న ప్రొఫెసర్లు, మెడికోలు

కోల్‌సిటీ: కళాశాలల్లో జూనియర్ విద్యార్థులను సీనియర్లు ర్యాగింగ్ చేస్తే చర్యలు తప్పవని గోదావరిఖని ఏసీపీ తులా శ్రీనివాసరావు హెచ్చరించారు. సిమ్స్‌లో మంగళవారం ట్రాఫిక్ రూల్స్, అభయ యాప్, క్యూఆర్ కోడ్, షీటీంపై అవగాహన కల్పించారు. ర్యాగింగ్ నేరమని, మెడికల్ కాలేజీలో ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేసేవారి పట్ల జాగ్రత్తగా ఉండాలని కోరారు. అభయ యాప్ ద్వారా క్షేమంగా గమ్యం చేరుకోవచ్చని, ఆటోలపై క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు అతికిస్తున్నామని తెలిపారు. సైబర్ నేరాలపైనా యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇబ్బందులు తలెత్తినప్పుడు డయల్ 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. పోలీసులు క్షణాల్లో అక్కడకు చేరుకుంటారని వివరించారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్, ట్రాఫిక్ ఏసీపీ జాన్ నర్సింహులు, సీఐలు ప్రమోద్‌రావు, ప్రవీణ్‌కుమార్, ప్రసాదరావు, షీటీం ఎస్సై రాజేంద్రప్రసాద్, ఏఎస్సై మల్లారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



ఓదెలలో ఇంటింటా ప్రచారం చేస్తున్న విజయరమణారావు

ఓదెల: కాంగ్రెస్ అధికారంలోకొస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మంగళవారం ఓదెలలో హాథ్‌సేహాథ్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా కాంగ్రెస్ ప్రచారం ప్రారంభించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులు, బీసీలకు చేసిందేమీ లేదన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ ఎత్తివేసి పబ్బంగడుపుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. పెద్దపల్లిలో కాంగ్రెస్ జెండా ఎగురుతుందని, ఓటర్లు తమవైపు చూస్తున్నారని తెలిపారు. నాయకులు చీకట్ల మొండయ్య, తీర్థాల వీరన్న, గోపతి సదయ్య, చింతం కుమారస్వామి, రాగిడి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్ పాం సాగు లక్ష్యాలు పూర్తి చేయాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఆయిల్ పాం సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం క్లస్టర్, డివిజన్ల వారీగా ఆయిల్ పాం సాగుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. పత్తి సాగుచేసే రైతులను ఆయిల్‌పాం వైపు మళ్లించేలా కృషి చేయాలన్నారు. జిల్లాలో 10 వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఇప్పటివరకు 730 ఎకరాల్లో సాగైందని, మరో 1842 ఎకరాల్లో ఆయిల్ పాం మొక్కలు, 818 ఎకరాల్లో డ్రిప్‌కోసం డీడీలు అందాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులకు వివరించాలన్నారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జగన్‌మోహన్ రెడ్డి, వ్యవసాయ శాఖ ఏడీఏలు కాంతారావు, శ్రీనాథ్, మురళీ, ఏఓలు, ఏఈవోలు పాల్గొన్నారు.

దేవునిపల్లి జాతరకు 15న వేలం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం దేవునిపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి జాతర సందర్భంగా దుకాణాల ఏర్పాటుకు ఈనెల 15న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ ముద్దసాని శంకరయ్య తెలిపారు. కొబ్బరికాయలు, లడ్డూ, పులిహోర, ప్రసాదం అమ్మకాలకు రూ.50వేల చొప్పున, పేలాలు, పుట్నాల అమ్మకాలకు రూ.లక్ష డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఈఏడాది నవంబర్ 25 నుంచి డిసెంబర్ 6వ వరకు అమ్మకాలు జరుపుకోవ్చని వివరించారు. ఆసక్తిగల వారు రూ.100 చెల్లించి ఫారం పొందాలని పేర్కొన్నారు.

నేడు ఎన్టీపీసీకి పవర్ సెక్రటరీ రాక

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు పర్యటనకు బుధవారం కేంద్రప్రభుత్వ సెక్రటరీ(పవర్) పంకజ్ అగర్వాల్ రానున్నారు. ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో జాయింట్ సెక్రటరీ పీయూష్ సింగ్, ఎన్టీపీసీ ఉన్నతాధికారులతో కలిసి పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని హెలిపాడ్‌కు చేరుకుంటారు. అనంతరం సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు, రిజర్వాయర్‌లోని 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్‌ప్లాంట్, మధ్యాహ్నం మూడు గంటలకు ఉన్నతాధికారులతో సమావేశం కానున్నారు. స్టేజీ–1లోని 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల మొదటి యూనిట్ ఇటీవల 72 గంటల ట్రయల్ రన్ సక్సెస్ కావడంతో యూనిట్ పనితీరును పరిశీలన అనంతరం సీవోడీ ప్రకటించే అవకాశాలున్నాయి.

ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి



మాట్లాడుతున్న సీపీ



హాజరైన పోలీసు అధికారులు

గోదావరిఖని: అసెంబ్లీ ఎన్నికలకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని సీపీ రెమా రాజేశ్వరి ఆదేశించారు. కమిషనరేట్ పరిధిలోని రెండు జిల్లాల పోలీసు అధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. ఎన్నికలకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని, షెడ్యూల్ రాగానే ఎన్నికల నియమావళి అమల్లోకి వస్తుందని, అధికారులు అందుకు లోబడి పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతల పర్యవేక్షణ, ఎన్నికల నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లు చేపట్టాల్సిన చర్యలు, బందోబస్తుపై సూచనలు చేశారు. నేరచరిత్ర, రౌడీషీటర్లు, ఎన్నికల్లో శాంతికి విఘాతం కలిగించే వారి జాబితా సిద్ధం చేసుకోవాలన్నారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించి వారిని సంబంధిత అధికారుల ముందు బైండోవర్ చేయాలన్నారు. ఎన్నికల శిక్షణ వారంపాటు కొనసాగుతుందన్నారు. పెద్దపల్లి డీసీపీ వైభవ్‌గైక్వాడ్, మంచిర్యాల డీసీపీ సుధీర్‌కేకన్, ఏఆర్ అడిషనల్ డీసీపీ రియాజ్ ఉల్ హక్, రెండు జిల్లాల ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

అర్హులను ఓటర్లుగా నమోదు చేయాలి



నమోదు కౌంటర్‌ను పరిశీలిస్తున్న రౌఫ్‌ఖాన్

జ్యోతినగర్: అక్టోబర్ వరకు 18 ఏళ్లు నిండేవారిని ఓటరుగా నమోదు చేయాలని స్వీప్ ఆక్టివిటీస్ జిల్లా నోడల్ అధికారి రౌఫ్‌ఖాన్ బూత్ లెవల్ అధికారులకు సూచించారు. ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్, టీటీఎస్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించారు. డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల చేశామని, పేర్లు లేని వారు ఫాం–6 ద్వారా ఈనెల 19లోపు నమోదు చేసుకోవాలని, ఫాం–8 ద్వారా సవరణలు చేసుకునే అవకాశముందని పేర్కొన్నారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో నూతన ఓటరు దరఖాస్తులు ఫారం 6, 7, 8 స్వీకరించేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. తహసీల్దార్, రెవెన్యూ అధికారులు బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.



పాండవలంక జల సవ్వడి

కాల్వశ్రీరాంపూర్ మండలం జాఫర్‌ఖాన్‌పేట, వెన్నెంపల్లి గ్రామాల మధ్య ఉన్న పాండవలంక జలపాతాన్ని చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివస్తున్నారు. ఏటా శ్రావణంలో ఇక్కడికి వనభోజనాలకు వచ్చి జలపాతం అందాలను ఆస్వాదిస్తూ మొక్కులు చెల్లిస్తుంటారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

క్లుప్తంగా

సీపీని కలిసిన ఆర్జీ-1 జీఎం



వినతి పత్రం అందజేస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనర్ రెమారాజేశ్వరిని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏరియాలోని గనులు, వాటిలో బొగ్గు ఉత్పత్తి, భూసేకరణ, పారిశ్రామిక సంబంధాలను సీపీకి వివరించారు. పనులకు అవరోధాలు లేకుండా సహకరిస్తామని సీపీ తెలినట్లు జీఎం పేర్కొన్నారు. జీఎం వెంట ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, ఎస్టేట్ అధికారి బాలసుబ్రహ్మణ్యం ఉన్నారు.

ఓసీపీ-2లో అధికారుల పర్యటన



ఓసీపీ-2ను సందర్శించిన టార్గెట్ కమిటీ సభ్యులు

రామగిరి: ఆర్జీ–3 డివిజన్‌లోని ఓసీపీ–2 లో కార్పొరేషన్ టార్గెట్ కమిటీ చైర్మన్ రమేశ్ మంగళవారం పర్యటించారు. ఉపరితల గనుల్లో నడుస్తున్న పనులను పరిశీలించారు. నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని, లక్ష్యాలు సాధించడానికి తీసుకుంటున్న చర్యలను ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావును అడిగి తెలుసుకున్నారు. వర్షకాలంలో ఉపరితల గనులలో బొగ్గు ఉత్పత్తికి అటంకం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రాజెక్టు అధికారి రాజేందర్, ప్రాజెక్టు ఇంజినీర్ నాగరాజు, మేనేజర్ కేవీ.రామారావు, రక్షణ అధికారి ఆసిఫ్ యాసిన్, కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

అన్‌మ్యాన్డ్ కార్మికులను ఆర్టిజన్స్‌గా గుర్తించాలి



ఎస్ఈ ఆఫీసు వద్ద కార్మికుల నిరసన

పెద్దపల్లిరూరల్: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న అన్‌మ్యాన్డ్ కార్మికులను ఆర్టిజన్స్‌గా గుర్తించాలని, ఆర్టిజన్ల అర్హతలను బట్టి జూనియర్ లైన్‌మన్, జూనియర్ అసిస్టెంట్, సబ్ ఇంజినీర్స్, ఓఎస్‌లుగా అవకాశం ఇవ్వాలని రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.స్వామి అన్నారు. విద్యుత్ కార్మికులు మంగళవారం ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. ఆ శిబిరాన్ని స్వామి సందర్శించి మద్దతు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులు రమేశ్, రాజేశం పాల్గొన్నారు.

‘గుర్తింపు’నకు గ్రీన్‌సిగ్నల్ లభించేనా..?

- రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం చూపనున్న ఎన్నికలు
- గుర్తింపు ఎన్నికలకు సింగరేణి అనాసక్తి
- అన్ని సంఘాల సమాన ప్రాతినిధ్యానికి సింగరేణి సై
- ఈనెల 22 జరిగే సమావేశంపైనే అందరి దృష్టి



గోదావరిఖని: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ముందు సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇస్తుందా..? ఎన్నికల బిజీలో ఉన్న అధికారులు ఆరు జిల్లాల్లో సింగరేణి ఎన్నికలకు అంగీకరిస్తారా..? జిల్లాల కలెక్టర్లు ఎలాంటి నివేదిక ఇస్తారు..? గుర్తింపు ఎన్నికలు జరిగితే ఆ ప్రభావం రానున్న అసెంబ్లీ ఎన్నికలపై చూపించే అవకాశాలు ఉంటాయి. ఈ క్రమంలో ఈనెల 22న నిర్వహించే డిప్యూటీ ఆర్ఎల్‌సీ సమావేశంపైనే అందరి దృష్టి పడింది.

ఎన్నికలు జాప్యం

సింగరేణిలో సుమారు 42వేల మంది పర్మినెంట్, మరో 30వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారు. గతంలో రెండేళ్లకోసారి నిర్వహించిన గుర్తింపు ఎన్నికలు ఇప్పుడు నాలుగేళ్లకోసారి నిర్వహిస్తున్నారు. ఈ సారి గడువు ముగిసి రెండేళ్లు దాటింది. దీంతో ఏఐటీయూసీ కోర్టును ఆశ్రయించడంతో ఎన్నికల ప్రక్రియ వేగవంతమైంది. ఆర్నెళ్లలోపు గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని కోర్టు సూచించినా సింగరేణి యాజమాన్యం కూడా కోర్టుకు వెళ్లి జూలైలో జరిగేలా చూడాలని కోరింది. దీనికి కోర్టు సమ్మతించింది. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల గడువు సమీపించడంతో రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం ఆ ఎన్నికలపైనే దృష్టి సారిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 11న డిప్యూటీ సీఎల్‌సీ సింగరేణిలో గుర్తింపు ఎన్నికలపై సమావేశం నిర్వహించి.. ఈనెల 22న ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయించింది. అయితే సింగరేణి విస్తరించి ఉన్న ఆరు జిల్లాలో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉంటేనే ఎన్నికల నిర్వహణ సాధ్యం. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో యంత్రాంగం బిజీగా ఉంటే గుర్తింపునకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం అనుమానమేనని అంటున్నారు.

ప్రధాన పార్టీలకు కీలకం

సింగరేణి గుర్తింపు ఎన్నికలు ప్రధాన పార్టీలకు కీలకంగా మారనున్నాయి. గుర్తింపు ఎన్నికల్లో విజయం సాధించే యూనియన్ అనుబంధంగా ఉండే పార్టీకి గెలుపు పాజిటివ్ కానుంది. సింగరేణి విస్తరించిన పెద్దపల్లి, మంచిర్యాల, కొమురంభీంఆసిఫాబాద్, జయశంకర్‌భూపాల్‌పల్లి, భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో సింగరేణి గుర్తింపు ఎన్నికలు జరగనున్నాయి. ఈక్రమంలో ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు అనుబంధంగా ఉన్న యూనియన్లు పోటీలో తలపడనున్నాయి. దీంతో గుర్తింపు ఎన్నికల్లో గెలిచిన యూనియన్లకు కార్మికుల మద్దతు లభిస్తుంది. అంతేకాకుండా గెలిచిన యూనియన్లు గనులపై అసెంబ్లీ ఎన్నికల్లో గేట్ మీటింగ్‌ల ద్వారా ప్రచారం చేసుకునే అవకాశం లభిస్తుంది. దీంతో కార్మికుల మద్దతు ఎక్కువగా పొందే అవకాశం ఉంటుంది.

ప్రధాన పార్టీల యూనియన్లు ఇవే..

ప్రధాన పార్టీలకు అనుబంధంగా యూనియన్లు ఉన్నాయి. సంస్థలో ఉన్న యూనియన్లు కార్మికుల ఓట్లను తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ప్రస్తుతం గుర్తింపు యూనియన్‌గా ఉన్న టీబీజీకేఎస్ బీఆర్ఎస్ పార్టీకి అనుబంధంగా కొనసాగుతోంది. ఐఎన్‌టీయూసీ కాంగ్రెస్ పార్టీకి, బీఎంఎస్ బీజేపీకి, ఏఐటీయూసీ సీపీఐ, సీఐటీయూ సీపీఎంకు అనుబంధంగా కొనసాగుతున్నాయి.

ఎన్నికల బిజీలో అధికారయంత్రాంగం

అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం బిజీ అయ్యింది. ఓటరు నమోదు, పోలింగ్‌బూత్‌ల వారీగా ఓట్లు తదితర అంశాలపై రెవెన్యూ అధికారులు, పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మకం, అతి సమస్యాత్మకం, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల లెక్కల్లో పోలీస్‌శాఖ ఉంది.

ఈనెల 22నాటి సమావేశంపైనే అందరి దృష్టి

సింగరేణి గుర్తింపు ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 22న ఇస్తామని డిప్యూటీ సీఎల్‌సీ ప్రకటించారు. వాస్తవానికి 21న నోటిఫికేషన్ ఇవ్వాలని భావించినా కార్మికుల ఏరియర్స్‌కు ఇబ్బంది కలుగుతుందని ఈనెల 22కు మార్పు చేశారు. ముందే ఎన్నికల నోటిఫికేషన్ ఇద్దామని భావించినా డైరెక్టర్(పా) రాకతో తేదీని మార్చారు.

రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించేనా..?

గుర్తింపు ఎన్నికల ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై పడే అవకాశాలు ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా సింగరేణి ఎన్నికలకు గ్రీన్ ఇవ్వడం కష్టమేనని భావిస్తున్నారు. ఇతర యూనియన్లు గెలిస్తే గనులపై జరిగే గేట్ మీటింగ్‌లు నిర్వహించడం కష్టంగా మారుతుంది. దీనికి కోడ్ ఆఫ్ డిసిప్లేన్ అడ్డంకిగా మారుతుంది. ఈక్రమంలో సింగరేణి ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోవడం కష్టమేనని అంటున్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషిచేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న జీఎం

రామగిరి: బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు సమష్టిగా కృషి చేయాలని కార్పొరేట్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ జీఎం రమేశ్ అన్నారు. మంగళవారం ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. వార్షిక ప్రణాళిక, బొగ్గు ఉత్పత్తి, ఓపెన్‌కాస్ట్‌లలో మట్టి వెలికితీతపై చర్చించారు. భూగర్భ, ఉపరితలగనులకు కావాల్సిన యంత్రాలు, సామగ్రి, పనిముట్లు, సదుపాయాలపై అధికారులకు సూచనలు చేశారు. సమావేశంలో ఆర్జీ–3, ఏపీఏ, ఓసీపీ, సర్వేల జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు, డీపీఎస్ సూర్యనారాయణ, పీఎస్‌కే.రవి, ఐఈ ఏజీఎం రవి, ఏరియా ఇంజినీర్ ఎలీషా, సీతారామం, ఎస్‌వోటూ జీఎంలు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు అందించాలి



గోదావరిఖని: సింగరేణి బొగ్గు నాణ్యతపై వినియోగదారులు నమ్మకంతో ఉన్నారని, ఇదే తీరు కొనసాగించాలని మార్కెటింగ్ జీఎం దేవేందర్ పేర్కొన్నారు. మంగళవారం జీడీకే–5 ఓసీపీని సందర్శించారు. నాణ్యత విషయంలో రాజీపడకుండా బొగ్గు సరఫరా చేయాలన్నారు. ప్రస్తుతం బొగ్గుకు విపరీతమైన డిమాండ్ ఉండడం వల్ల ప్రైవేటు, విదేశీ సంస్థలకు దీటుగా సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తిలో ముందంజలో ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేయాలన్నారు. ఆయన వెంట సేఫ్టీ అధికారి పునుగోటి శ్రీనివాస్ ఇతర అధికారులున్నారు.

షేర్ మార్కెట్ పేరుతో రూ.2.11 కోట్లు మోసం

- ఐదునెలలుగా అజ్ఞాతంలో నిందితులు
- పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు
- సీపీ రెమా రాజేశ్వరి వెల్లడి



అరెస్ట్ చూపిస్తున్న సీపీ రెమా రాజేశ్వరి

గోదావరిఖని: షేర్ మార్కెట్ పేరుతో రూ.2.11కోట్లు మోసం చేసి.. ఐదు నెలలుగా అజ్ఞాతంలో ఉన్న నిందితుడు చెవ్వా రవిని రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సీపీ రెమా రాజేశ్వరి నిందితుడికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. రవి కమిషనరేట్ పరిధిలో సుమారు 50మందిని మోసం చేశాడు. షేర్ మార్కెట్‌లో డబ్బులు పెట్టుబడి పెడితే తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు ఇస్తానని ఆశ చూపేవాడన్నారు. డబ్బులు ఇస్తే లాభాలు రోజువారీగా, వారం, నెల వారీగా అధిక మొత్తంలో ఇస్తానని చెప్పి జిల్లాకు చెందిన 50 మంది నుంచి సుమారు రూ.2.11కోట్లు వసూలు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి నేతృత్వంలో సీఐ సుధాకర్, ప్రత్యేక టీం ఏర్పాటు చేశారు. ఎప్పటిలాగే మరింత మందిని మోసం చేసేందుకు హైదరాబాద్ నుంచి మంచిర్యాల వస్తున్నాడనే సమాచారం మేరకు తనిఖీలు చేస్తుండగా.. మంచిర్యాల రైల్వేబ్రిడ్జి ప్రాంతంలో రవి అనుమానాస్పదంగా కనిపించాడు. వెంటనే అతడిని అరెస్ట్ చేసి క్రెడిట్ కార్డులు, బ్యాంక్ పాస్‌బుక్కులు, చెక్ బుక్కులు, రూ.8వేల నగదు, రిజిస్టర్ బుక్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సమావేశంలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, సీఐ సుధాకర్, అశోక్, ఎస్సైలు ప్రసాద్, లచ్చన్న సిబ్బంది ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

- రూ.22,210 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం

జ్యోతినగర్: టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మంగళవారం నిర్వహించిన దాడిలో ఐదుగురు పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని ఎన్టీపీసీ పోలీసులకు అప్పగించారు. మల్యాపూర్ శివారులోని రహస్య ప్రదేశంలో కొందరు పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్ అధ్వర్యంలో ఎస్సై ప్రసాద్, సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఇందులో ఐదుగురు పట్టుబడ్డారు. వారి నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రూ.22,210 నగదు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం ఎన్టీపీసీ ఎస్సై బి.జీవన్‌కు అప్పగించారు.

డెంగీతో మహిళ మృతి

- మృతురాలి కొడుకుకూ డెంగీ పాజిటివ్




రజిత(ఫైల్)

ముత్తారం: మండలంలోని ఓడెడ్‌కు చెందిన కొత్తపల్లి రజిత (40) డెంగీతో బాధపడుతూ సోమవారం రాత్రి చనిపోయింది. రజిత నాలుగురోజుల క్రితం జ్వరం రావడంతో స్థానిక ఆర్ఎంపీ వద్ద వైద్యం చేయించుకుంది. పరిస్థితి విషమించడంతో సోమవారం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు డెంగీ పాజిటివ్‌గా నిర్ధారించారు. వైద్య సేవలు అందిస్తుండగానే పరి స్థితి విషమించి రాత్రి మృతి చెందింది. మృతురాలి చిన్న కొడుకు అశోక్‌కూ డెంగీ పాజిటివ్‌గా నమోదైంది. విషయం తెలుసుకున్న ముత్తారం ప్రభుత్వ వైద్యుడు అమరేందర్‌రావు మృతురాలి కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. మృతురాలికి భర్త సాయిలు, కుమారులు రాకేశ్, అశోక్ ఉన్నారు.

కారుపై కూలిన గోడ

రామగిరి: సెంటనరీకాలనీ తెలంగాణ చౌక్ వద్ద గల షాపింగ్ కాంప్లెక్స్‌లో మంగళవారం ఉదయం మూడు దుకాణాల గోడలు కూలిపోయాయి. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు గోడలు తడిచి వెనుకవైపు ఉన్న కారుషెడ్డుపై కూలిపోవడంతో ఓ కారు ధ్వంసమైంది. ఆర్ఐ రాజాబాబు పంచానామా నిర్వహించారు.

కాశీకి వెళ్లివస్తూ గుండెపోటుతో మహిళ మృతి



నాగమణి (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్: కాశీవిశ్వేశ్వరస్వామి దర్శనానికి వెళ్లిన ఓ మహిళ తిరుగు ప్రయాణంలో మార్గంమధ్యలో కాన్పూర్ స్టేషన్ సమీపంలో రైళ్లోనే గుండెపోటుకు గురై చనిపోయింది. ఈ సంఘటన కాలవ్రశ్రీరాంపూర్‌లో విషాదం నింపింది. మండల కేంద్రానికి చెందిన పులి నాగమణి(65) పదిహేను రోజుల క్రితం బంధువులతో కలిసి కాశీవిశ్వేశ్వరస్వామి దర్శనానికి వెళ్లింది. దైవదర్శనాలు చేసుకుని రైలులో తిరుగుప్రయాణమయ్యారు. కాన్పూర్ రైల్వేస్టేషన్ సమీపంలోకి రాగానే గుండెపోటు వచ్చి అక్కడికక్కడే మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. ఆమె మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరనుంది. నాగమణి భర్త పులి మల్లారెడ్డి రిటైర్డ్ ఎంఈవో. కుమారుడు బాజిరెడ్డి కాంగ్రెస్ జిల్లా నాయకుడిగా కొనసాగుతున్నారు.

వివాహం కావడం లేదని యువకుడి ఆత్మహత్య

- క్రిమి సంహారక మందుతాగి యువకుడి ఆత్మహత్య



రాచర్ల సంతోష్ (ఫైల్)

జూలపల్లి: వివాహం కావడంలేదని మనస్తాపానికి గురైన ఓ యువకుడు క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పెద్దాపూర్‌లో మంగళవారం వెలుగుచూసింది. ఎస్సై వెంకటకృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాచర్ల యమున, లక్ష్మీకాంతం దంపతులు. వీరికి ముగ్గురు కుమారులు, కూతురు సంతానం. లక్ష్మీకాంతం కొన్నేళ్ల క్రితమే చనిపోయారు. పెద్దకుమారుడు లవకుమార్ కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. చిన్న కుమారుడు సాయి క్రిష్ణ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కుమారుడు సంతోష్ (32) డిగ్రీ వరకు చదువుకుని గ్రామంలోనే కిరాణషాపు నడిపిస్తూ తల్లితోపాటు ఉంటున్నాడు. సోమవారం కరీంనగర్ వెళ్లి సాయంత్రం ఇంటికొచ్చిన సంతోష్ భోజనం చేసి పడుకున్నాడు. మంగళవారం ఉదయం తల్లి నిద్రలేపగా కదలిక లేదు. పక్కనే పురుగుల మందు డబ్బా కనిపించడంతో యమున తన తమ్ముడైన సూర గంగయ్యకు తెలిపింది. గంగయ్య వెంటనే కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలి పారు. యమున ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శిక్షణ పొందిన మహిళలకు పరీక్షలు

రామగిరి: వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు ఈనెల 14 ఉదయం 10గంటలకు సెంటనరీకాలనీ కమ్యూనిటీ హాల్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావు తెలిపారు. సింగరేణి సేవా సమితి, ఆర్జీ–3, ఏపీఏ ఆధ్వర్యంలో రచ్చపల్లి పునరావాస కేంద్రం, కల్వచర్ల, సెంటనరీకాలనీ, రత్నాపూర్ గ్రామాల మహిళలు టైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలు పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం

- పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: ప్రజాసంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని క్రిస్టియన్‌కాలనీ, హనుమాన్‌నగర్, టీచర్స్‌కాలనీల్లో మంగళవారం ఇంటింటా ప్రచారం చేశారు. ప్రజలందరికీ మేలు కలిగే పథకాలు రూపొందించి అమలు చేస్తున్న ఘనత సీఎం దేనన్నారు. పెద్దపల్లిని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. 11వ వార్డులో రూ.46.56 లక్షలు, 24వ వార్డులో రూ.11.50లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. పెద్దపల్లిలో రూ.100 కోట్లతో పనులు సాగుతున్నాయని పేర్కొన్నారు. నాయకులు సంపత్, ఇనుగాల తిరుపతిరెడ్డి, లక్ష్మణ్‌రావు, కంది భూమయ్య, బాపు, సుగుణాకర్, ప్రసాద్, కిరణ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జెండాలు వీడి బీఆర్ఎస్‌లోకి రండి

సుల్తానాబాద్ : బీజేపీ, కాంగ్రెస్ జెండాలు వీడి బీఆర్ఎస్‌లోకి రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సుల్తానాబాద్‌కు చెందిన బీజేపీ నాయకులు, మహిళలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.

అందుబాటులో సేవలు

జూలపల్లి: ప్రజలకు అన్ని సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన పంచాయతీ రాజ్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవితో కలిసి ప్రారంభించారు. డీఈ దేవేందర్‌ను సన్మానించారు. జూలపల్లిలో డివిజన్ కార్యాలయం ఏర్పాటుతో ప్రజలకు ఇబ్బందులు తప్పాయన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



మెడల్స్ సాధించిన విద్యార్థులు

యైటింక్లయిన్‌కాలనీ: ఈనెల 9, 10వ తేదీల్లో కేరళ రాష్ట్రం త్రివేంద్రం జిమ్మి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రెండో సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ జాతీయస్థాయి కరాటే పోటీల్లో స్థానిక కేజీబీవీ పాలకుర్తి విద్యార్థులు సత్తాచాటారు. పోటీల్లో ఆరుగురు విద్యార్థులు పాల్గొనగా.. 8వ తరగతి విద్యార్థి బి.సుమన్ బ్రాంజ్ మెడల్, ఇతర విద్యార్థులు ప్రశంసపత్రాలు అందుకున్నారని మాస్టర్ మల్యాల రామస్వామి తెలిపారు. కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను టీం మేనేజర్ డాగ్లేస్ విన్సెంట్, కరాటే అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

సకల జనుల సమ్మె ప్రపంచ ఉద్యమాలకు ఆదర్శం

- టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లయ్య



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కెంగర్ల మల్లయ్య

గోదావరిఖని: సకల జనుల సమ్మె ప్రపంచ ఉద్యమాలకు ఆదర్శమని టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సమ్మె స్ఫూర్తి సభల కన్వీనర్ కెంగర్ల మల్లయ్య అన్నారు. మంగళవారం జీడీకే–2వ గనిపై గేట్ మీటింగ్ మాట్లాడారు. సింగరేణి కార్మికులు తమ హక్కులతోపాటు ప్రజల పక్షాన నిలబడి పోరాడుతారని అనేక సంఘటనలు నిరూపించాయన్నారు. సుదీర్ఘ సమ్మెలకు దీటుగా సకలజనుల సమ్మె జరిగిందని, అందుకే రాష్ట్రం సాధ్యమైందన్నారు. ఈనెల 13న స్థానిక ప్రధాన చౌరస్తాలో నిర్వహించే స్ఫూర్తి సభకు మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హాజరవుతున్నారని, కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని సూచించారు. నాయకులు గండ్ర దామోదర్‌రావు, మాదాసి రామ్మూర్తి, పులి మోహన్, దేవ వెంకటేశం, కనకం శ్యాంసన్, దాసరి నర్సయ్య, దొరగాండ్ల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో డ్రైవర్ మృతి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్ధుంపూర్‌లోని రాజీవ్‌రహదారిపై సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ప్రైవేట్ స్కూల్‌వ్యాన్ డ్రైవర్ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గొల్లపల్లికి చెందిన ఎలవేణి రవి(33) కరీంనగర్‌లోని కాకతీయ స్కూల్‌వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని సోమవారం రాత్రి కరీంనగర్ నుంచి గొల్లపల్లికి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. మొగ్ధుంపూర్ హైస్కూల్ వద్ద రాజీవ్‌రహదారి దాటుతున్న రవి వాహనాన్ని సుల్తానాబాద్‌నుంచి కరీంనగర్‌వైపు వేగంగా వెళ్తున్న గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్టడంతో కింద పడిపోయాడు. వెంటనే అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం వేకువజామున మృతిచెందాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తన భర్త రవి మృతిచెందాడని మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిరుద్యోగ మహిళలకు వృత్తి విద్య పరీక్ష



గోదావరిఖని: సింగరేణి సేవా సమితి ద్వారా వృత్తి విద్యా కోర్సులు నేర్చుకున్న మహిళలకు ఖాదీ గ్రామోద్యోగ్ మహావిద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం పరీక్ష నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి 255మంది హాజరయ్యారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందించనున్నట్లు వెల్లడించారు. సేవా అధ్యక్షురాలు చింతల లక్ష్మి, పర్సనల్ ఏజీఎం సీహెచ్.లక్ష్మినారాయణ, కో–ఆర్డినేటింగ్ ఆఫీసర్ జి.హనుమంతరావు, ఖాదీ గ్రామోద్యోగ మహావిద్యాలయం కో–ఆర్డినేటర్ డి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిని హత్యచేసిన కొడుకుకు జీవిత ఖైదు

కరీంనగర్‌క్రైం: తల్లిని చంపిన కొడుకుకు జీవితఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ తీర్పునిచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్, చింతకుంట గ్రామానికి చెందిన భూక్య కల్యాణ్ విలాసవంతమైన జీవితానికి అలవాటు పడ్డాడు. 2020లో అతని తల్లి భూక్య రేణుకతో జరిగిన ఘర్షణలో ఆమె గొంతు నులిమి హత్య చేశాడు. రేణుక తమ్ముడు రంగానాయక్ ఫిర్యాదు మేరకు కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లాకోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్లు సాక్షులను ప్రవేశపెట్టారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ సాక్ష్యాధారాలు పరిశీలించి నిందితునికి జీవిత ఖైదు, రూ.5000 జరిమానా విధించారు. నిందితుడికు శిక్షపడేలా కృషిచేసిన ఎస్‌హెచ్‌వో డి.చంద్రశేఖర్, ఏఎస్ఐ తిరుపతి, హెడ్‌కానిస్టేబుల్ సత్యంను సీపీ సుబ్బారాయుడు అభినందించారు.